

షెల్టర్లు కరువు.. ప్రయాణం బరువు



బ్యారెక్స్‌కు వెళ్లే దారిలో బస్టాప్‌లో నిర్వహిస్తున్న వ్యాపారాలు



పూర్ణామార్కెట్ దరి దుర్గాలమ్మ గుడి వద్ద బస్సు కోసం రోడ్డుపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు

జగదాంబ: పాతనగరంలో బస్ షెల్టర్ల నిర్మాణం జీవీఎంసీ గాలికి వదిలేయడంతో ప్రయాణికులు ఎండావానలకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గం వైపు జీవీఎంసీ, ఆర్టీసీ కన్నెత్తి చూడకపోవడంతో అనేక చోట్ల షెల్టర్ల లోటు కనిపిస్తోంది. పాతనగరంలో గత ప్రభుత్వం నూతన బస్టాప్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకుంది. అయితే ప్రభుత్వం మారిపోవడంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే నిలిచిపోయాయి. నియోజకవర్గంలో పర్యాటక కేంద్రం అయిన జగదాంబ జంక్షన్ వద్ద మాత్రమే బస్టాప్ నిర్మాణం చేపట్టారు. జగదాంబ నుంచి వన్‌టౌన్ వరకు ఒక్క బస్టాప్ కూడా లేకపోవడంతో ప్రయాణికులు ఎండా, వానల్లో ఇబ్బంది పడుతున్నారు. నగర నలుమూలల నుండే కాకుండా విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుండి పూర్ణామార్కెట్‌కు వచ్చే వారు ఇక్కడ కనీసం నిలబడడానికి కూడా వీల్లేని పరిస్థితులతో ఇబ్బంది పడుతున్నారు.

బస్టాపుల్లో దుకాణాలు..

నియోజకవర్గంలో ఎలాగూ బస్టాపులు లేవు. ఉన్న ఒకటీ అరా బస్టాపుల్లో ప్రయాణికులు వేచి ఉండే వీల్లేకుండా వ్యాపారులు దుకాణాలు నిర్వహించుకుంటున్నారు. ఆటోవాలాలు బస్సులు స్టాపులో వచ్చి ఆగే వీల్లేకుండా తమ ఆటోలను అడ్డంగా పెట్టి పాసింజర్లను ఎక్కించుకునేందుకు హడావుడి పడుతుంటారు. దీంతో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు వచ్చే బస్సులు ఎక్కేందుకు ఇబ్బంది పడుతున్నారు.

బస్ ఎక్కేందుకు చోటివ్వరు..

బస్టాపులో వేచి ఉండేందుకు ఎలాగూ వీల్లేకుండా ఉంది.. కనీసం బస్సు ఎక్కే అవకాశం కూడా లేకుండా అడ్డంగా ఆటోలు నిలుపుతుండడం వల్ల ఇబ్బంది పడుతున్నట్లు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు స్పందించి బస్ షెల్టర్లలో దుకాణాలు, స్టాపుల్లో ఆటోలు తొలగించి సురక్షిత ప్రయాణానికి వీలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బాలికకు ఆశ్రయం



బాలికను కేర్ టేకర్‌కు అప్పగిస్తున్న పోలీసులు

అల్లిపురం: ఆర్టీసీ కాంప్లెక్స్‌లో 12 ఏళ్ల బాలికను టూటౌన్ పోలీసులు గుర్తించి ఏయూటీడీ షెల్టర్ నిర్వాహకుడు ప్రగడ వాసుకు సమాచారం అందజేశారు. దీంతో మహిళా షెల్టర్ కేర్ టేకర్ లీలావతి అక్కడికి వెళ్లి బాలికను షెల్టర్‌కు తీసుకొచ్చి వివరాలు కనుక్కునే ప్రయత్నం చేశారు. బాలిక మానసిక పరిస్థితి బాగులేదని తెలుసుకున్నారు. బాలికను ఒక పెద్దావిడ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వదిలి వెళ్లిపోయిందని, అక్కడ అందరినీ ఈ బాలిక కొడుతుండటంతో స్వీపర్ చూసి పోలీసులకు సమాచారం అందించినట్లు కేర్ టేకర్ తెలిపారు. బాలిక గురించి వాకబు చేయగా గ్రీన్ వేలీ సంస్థ సునీత ఇచ్చిన సమాచారంతో పాప అన్నయ్య రాజారావును రప్పించి వివరాలు సేకరించారు. పాప తల్లిదండ్రులు అప్పారావు, మారుతి అని, లేబర్ పని చేస్తారని, శంకరమఠం దగ్గర ఉంటున్నట్లు తెలిపారు. పాపను హాస్పిటల్లో చేర్పించమని చెప్పి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలు



భూపేష్‌నగర్ వాసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఎర్రంనాయుడు

అల్లిపురం: డ్రగ్స్, గంజాయి వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం భూపేష్‌నగర్‌లో స్థానికులకు ఆయన అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగించి యువత తమ ఉజ్వల భవిష్యత్ పాడు చేసుకుంటున్నారన్నారు. వార్డులో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ అమ్మినా, వినియోగించినా పోలీసులకు సమాచారం అందజేయాలని ఆయన కోరారు.

రేణుక యల్లమ్మ సన్నిధిలో అన్నదానం



అన్నసమారాధనలో పాల్గొన్న డాక్టర్ రమణమూర్తి తదితరులు

అల్లిపురం: గురువారం కెప్టెన్ రామారావు జంక్షన్‌లో ఉన్న రేణుక యల్లమ్మ ఆలయంలో అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పీవీ రమణమూర్తి తన జన్మదినం సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలకు చీరలు పంపిణీ చేసి అన్నసమారాధన చేశారు. ఈ సందర్భంగా ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, సలహాదారు బొడ్డేటి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు గణేష్, సత్యనారాయణ, కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు.

మానసిక దివ్యాంగురాలికి సహాయం



మానసిక దివ్యాంగురాలితో మాట్లాడుతున్న సీఐ జీడీ బాబు, మమత

అల్లిపురం: మానసిక దివ్యాంగురాలిని మమత చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ మమత, వన్‌టౌన్ సీఐ జీడీ బాబు ఆస్పత్రిలో చేర్చారు. వారు తెలిపిన వివరాల ప్రకారం 1-టౌన్ ఏరియాలో ఒక మహిళ మాసిన దుస్తులు ధరించి, మురుగు కాలవలోని నీరు తాగుతూ, చెత్తకుప్పలోని ఆహారం తింటూ దయనీయ స్థితిలో ఉందని స్థానికులు మమత చారిటబుల్ ట్రస్ట్‌కి సమాచారం ఇవ్వడంతో ట్రస్ట్ ఫౌండర్ మమత స్పందించి అక్కడికి చేరుకున్నారు. వన్‌టౌన్ సీఐ జీడీ బాబు సహాయంతో మానసిక వికలాంగురాలిని పెదవాల్తేరులో ఉన్న మెంటల్ కేర్ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఆమె కోలుకున్న తర్వాత వివరాలు సేకరించి ఆమె కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని మమత తెలిపారు.

33 వార్డులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'



'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొన్న 33వ వార్డు నాయకులు

అల్లిపురం: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాలతో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'కార్యక్రమం 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. కుమ్మర వీధి బూత్ నంబర్ 69లో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి బాబు మోసాలను నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పచ్చిరపల్లి రాము, వేంకటేశ్వర స్వామి ఆలయం మాజీ చైర్మన్ ఆడారి వెంకట మహేష్, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, వార్డు సెక్రటరీ సంతోష్ కుమార్, సీనియర్ నాయకులు ధర్మ, పీవీఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, మత్స్యకార నాయకుడు చోడిపల్లి శివకుమార్, పాల దామోదర రెడ్డి, తరుణ్ కుమార్, జి. అప్పలకొండ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాఖీ పౌర్ణమికి ఏర్పాట్లు పూర్తి



ఇసుక కొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి

దాబాగార్డెన్స్: అన్నవరం సత్యదేవుడి అంతటి ప్రాధాన్యత గల ఇసుకకొండ(బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో రాఖీ (శ్రావణ) పౌర్ణమికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు రూ.20, రూ.200, రూ.300 టికెట్లు అందుబాటులో ఉంచారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. ముందుగా చాలా మంది భక్తులు సాగరతీరంలో స్నానమాచరించి స్వామి దర్శనానికి రానున్నారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు తరలి రానున్న దృష్ట్యా చర్యలు చేపట్టారు. వేకువజాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు, ధ్వజస్తంభ పూజలు జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

నేడు మూడో శ్రావణ శుక్రవారం పూజలు



విశేష పూజలో కనకమహాలక్ష్మి



శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొన్న భక్తులు



ఆలయంలో వేంచేసిన బంగారమ్మ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు గురువారం 14వ రోజుకు చేరాయి. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన అభ్యర్థనల మేరకు భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నేడు మూడో శుక్రవారం శ్రావణం పూజలు..

శ్రావణమాసం మూడో శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి దర్శనం నేడు..

శ్రావణమాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని కురుపాం మార్కెట్ సమీపాన వేంచేసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారు పట్టు వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అమ్మవారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు, మహిళలచే సామూహిక లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.

దిబ్బలపాలెం రామాలయంలో..

దిబ్బలపాలెం రామాలయంలో..

జగదాంబ జంక్షన్ దరి దిబ్బలపాలెంలో వేంచేసిన సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు చందక అప్పలరాజు తెలిపారు. ఆలయంలో గల బంగారమ్మకు ఉదయం జలాభిషేకం, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు, సాయంత్రం లక్ష్మీ సహస్ర కుంకుమార్చన, లక్ష్మీ గణపతి హోమం నిర్వహించనున్నామని తెలిపారు. పూజలో పాల్గొనే మహిళలకు అప్పలరాజు, శ్రీదేవి దంపతులచే చీర, జాకెట్, గాజులు, పసుపు కుంకుమ అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

ముర్రుపాలతోనే చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐడీసీడీఎస్ అధికారులు



మాట్లాడుతున్న 33వ వార్డు కార్పొరేటర్ వసంతలక్ష్మి



కార్యక్రమంలో పాల్గొన్న వైద్య నిపుణులు

అల్లిపురం: అప్పుడే పుట్టిన చిన్నారులకు ముర్రుపాలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అమ్మవారి వీధి, కుమ్మరి వీధి, బంగారుమెట్ట, వుడ్‌యార్డు, వెంకటేశ్వరమెట్ట-1 సచివాలయం ఆధ్వర్యంలో బుధవారం కుమ్మరవీధి సచివాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ 'తల్లిపాలు ముద్దు- డబ్బా పాలు వద్దు'అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతలక్ష్మి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలు శిశువును న్యుమోనియా, అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుండి కాపాడతాయని తెలిపారు. పిల్లల మేధస్సును మెరుగుపరచడంలో తల్లి పాలు సహాయపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో జి.శ్రీలత, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రొఫెసర్, హెచ్‌వోడీ డాక్టర్ టి.రాధాకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జె.శ్రీనివాస్, డాక్టర్ వి.హరిత, డాక్టర్ వి.వందన, సోషల్ వర్కర్ అచ్యుత రామయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

తల్లిపాలు శిశువులకు దివ్య ఔషధం..

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సాయి సునీల్ కిషోర్ తెలిపారు. కేజీహెచ్ డౌన్‌లో గల మెడికవర్ ఆస్పత్రి సముదాయంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తల్లిపాలలోని పోషక విలువలు శిశువు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల తల్లులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయ్, డాక్టర్ మౌనిక, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ శ్రీకాంత్, నర్సింగ్ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పి-4 ప్రగతిని వివరించిన కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అమరావతి సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరేందిర ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. పీ-4లో ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి కలెక్టర్ వివరించారు. అలాగే పీపీపీ కింద చేపట్టిన ప్రాజెక్టుల ప్రగతిని వివరించారు.

మార్కెట్లు కిటకిట



అరటి పండ్లు, కొబ్బరికాయలు కొంటున్న భక్తులు



అల్లిపురం మార్కెట్‌లో పూలు కొంటున్న భక్తులు

అల్లిపురం: శ్రావణ మాసం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా గురువారం మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. అల్లిపురం మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్ రద్దీగా మారింది. పండ్లు, పూలు, కొబ్బరికాయలు, అరటి పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి. కొబ్బరికాయ రూ.30 నుంచి రూ.50 వరకు సైజుని బట్టి విక్రయించారు. దేశవాళీ అరటి పండ్లు డజను రూ.70 నుంచి రూ.80, నాగపూర్ అరటి పండ్లు రూ.100 నుంచి రూ.120, యాపిల్స్ కేజీ రూ.250 నుంచి రూ.300, సీతాఫలం రూ.100కి మూడు, పువ్వులు 50 గ్రాములు రూ.60 చొప్పున విక్రయించారు. అరటి ఆకులు రూ.5, రూ.10కి అమ్మారు. ధర ఎలా ఉన్నా ఏడాదికి ఒకసారి అమ్మవారికి ఫలం, పుష్పం సమర్పించాలని భక్తులు కొనుగోలు చేశారు.

ఘనంగా జన్మాష్టమి వేడుకలు



కుండపై నృత్యం చేస్తున్న చిన్నారి



నాట్యం చేసిన చిన్నారికి జ్ఞాపిక అందజేస్తున్న దాసుడు ఈశ్వరరావు. చిత్రంలో అనిల్

మహారాణిపేట: జిల్లా పరిషత్ జంక్షన్‌లోని శ్రీ కృష్ణ చైతన్య మఠంలో ఆనంద మేళా నిర్వహించారు. జన్మష్టామి వేడుకల్లో భాగంగా చిన్నారులు స్వామివారికి నృత్య నీరాజనం సమర్పించారు. రూపా డ్యాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు తమ నృత్యాలతో గోపాలుడిని కీర్తిస్తూ కూచిపూడి నృత్యాలు చేశారు. మురిపాల గోపాల రారా కృష్ణా, జై జనార్దనా, శ్రీ కరశుభకర, గణనాయకాయ, హరే కృష్ణ తదితర పాటలకు చిన్నారులు లయబద్ధంగా నృత్యం చేశారు. కుండ నృత్యాలు, బిందె నృత్యాలు, హారతి చేతబట్టి చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అంతకు ముందు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన ఫళ శయన ఊయలలో ప్రతిష్ఠింపజేసి ఊంజల్ సేవ నిర్వహించి, హరి సంకీర్తనలతో భజనలు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ దాసు మాట్లాడుతూ చిన్నారులు ఆనంద గోపాలుడిని కీర్తిస్తూ నృత్యాలు చేయడం.. అందునా స్వామివారి సన్నిధిలో నృత్య నీరాజనం సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. చిన్నారులు అన్ని వేదికలపైనా నృత్యాలు చేసి స్వామి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్నారులకు సర్టిఫికెట్లు, షీల్డులు, స్వామివారి ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అనిల్, స్వామివారి దాసుడు ఈశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

10న నేత్ర వైద్య శిబిరం

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెయిన్‌బో కంటి ఆస్పత్రి సహకారంతో ఈ నెల 10న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవి, పి.కమల ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు వుడా కాలనీ ఈస్ట్ పార్కులోని అబ్దుల్ కలాం ఆడిటోరియంలో నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ సుఖేష్ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

'గుండె ఆపరేషన్లు ఆగాయన్న ప్రచారం నిజం కాదు'



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మహారాణిపేట: గత కొద్దిరోజులుగా కేజీహెచ్ కార్డియాలజీ విభాగంలో గుండె ఆపరేషన్లు జరగడం లేదని, కార్డియో విభాగాన్ని మూసివేశారని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గురువారం కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణన్, సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ యు.శ్రీహరి తదితరులతో కలిసి కార్డియాలజీ విభాగంలో పర్యటించారు. కేజీహెచ్‌లో ఎక్కడా గుండె ఆపరేషన్లు ఆపలేదని తెలిపారు. శస్త్ర చికిత్సకు ఉపయోగించే యంత్రం సాంకేతిక సమస్య వల్ల పని చేయడం లేదన్నారు. 1996లో హిందుస్తాన్ షిప్‌యార్డ్ అందజేసిన యంత్రం గత ప్రభుత్వ పాలనలో రిపేరుకు వస్తే, దాన్ని సరి చేయలేదన్నారు. శనివారం కొత్త మిషన్ అందుబాటులోకి రానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా వేంకటేశ్వరాలయ పునర్నిర్మాణ పనులు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం తిక్కవానిపాలెంలో 93 ఏళ్ల చరిత్ర గల వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆలయ శ్లాబ్ నిర్మాణానికి గురువారం మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొరుసు మహేశ్వరరెడ్డి, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు గొరుసు తనూజ దంపతులు కొబ్బరికాయలు కొట్టి భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారాలు అందిస్తామని మహేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చేనేత కళాకారులకు ఆత్మీయ సత్కారం



చేనేత కళాకారులను సత్కరిస్తున్న కలెక్టర్ హరేందిరప్రసాద్

మహారాణిపేట: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకు చెందిన చేనేత కళాకారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సత్కరించారు. చేనేత కళాకారులు కె. చినబాబు, చంద్రరావు, బంగారు, ఆనందరావు, చేనేత, జౌళి శాఖ అధికారులతో కలిసి కలెక్టర్‌ను గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలవగా.. కలెక్టర్ వారికి చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి, సత్కరించారు. జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కూడా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ చేనేత వస్త్రాలు అందజేసి సత్కరించారు. చేనేత, జౌళి శాఖ ఏడీ వి. పద్మ, డెవలప్‌మెంట్ ఆఫీసర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: రాఖీ సోదరభావానికి ప్రతీక అని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. గురువారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధులు ఏర్పాటు చేసిన రక్షాబంధన్ వేడుకల్లో పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రక్షాబంధన్ అంటేనే అత్యంత ముఖ్యమైన పర్వదినమని, ప్రతి ఇంట శుభం జరిగేందుకు ఎక్కువ మంది ఈ వేడుకలు నిర్వహించుకుంటారన్నారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు బి.కె. రామేశ్వరి, శివలీల మాట్లాడుతూ ప్రతి ఏటా రక్షా బంధన్ వేడుకలు జర్నలిస్టుల నుంచే ప్రారంభించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఏజ్ కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ రాజు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, సీనియర్ పాత్రికేయులు ఆర్.నాగరాజు పట్నాయక్ తదితరులు మాట్లాడుతూ సమాజంలో బ్రహ్మకుమారీస్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ప్రతి పండగను జర్నలిస్టులతో జరుపుకోవడం అత్యంత అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అతిథులతో పాటు, పెద్ద ఎత్తున జర్నలిస్టులకు రాఖీలు కట్టి మిఠాయిలు. జ్ఞాపికలు అందజేశారు.